సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శనివారం | 30 | డిసెంబర్ | 2023



కొనసాగిన పత్రాల సమర్పణ

కేయూలో నిర్వహిస్తున్న 'ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్'లో భాగంగా పరిశోధనా పత్రాల సమర్పణ కొనసాగింది. చరిత్రకారులు, పరిశోధకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - 10లో



రైల్వే బ్లాక్‌తో పలు రైళ్లు రద్దు

కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో చేపట్టిన నాన్ ఇంటర్ లాకింగ్ బ్లాక్ పనులతో పలు రైళ్లు రద్దైనట్లు అధికారులు తెలిపారు. - 10లో

గరిష్టం/కనిష్టం
$30^0/17^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం కొంతమేరకు మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి సమయంలో మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

53 మందిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కేయూ క్యాంపస్: డిగ్రీ కోర్సుల పరీక్షల్లో కేయూ పరిధి వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ.. శుక్రవారం 53 మంది విద్యార్థులు పట్టుబడ్డారు. వారిపై మాల్ ప్రాక్టీస్ కింద కేసులు బుక్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి తెలిపారు. వరంగల్‌లో ఆరుగురు, ఖమ్మంలో ఇద్దరు, ఆదిలాబాద్‌లో 45 మంది విద్యార్థులు కాపీయింగ్ చేస్తూ పట్టుబడ్డారని, వారిపై మాల్ ప్రాక్టీస్ కింద కేసులు బుక్ అయ్యాయని తెలిపారు.

కేఎంసీలో పారామెడికల్ కౌన్సెలింగ్



ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలలో పారామెడికల్ 2023–24 సంవత్సర ప్రవేశానికి రెండో రోజు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. 28, 29 తేదీల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 266 సీట్లకు గాను 176 సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. మిగిలిన 90 సీట్లకు మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ తేదీలు ప్రకటిస్తామని తెలిపారు.

ప్రశాంతత నడుమ 'నూతన' వేడుకలు: సీపీ

వరంగల్ క్రైం: ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. డిసెంబర్ 31న రాత్రి పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. వేడుకల్ని అర్ధరాత్రి 12.30 గంటల్లోపు ముగించాలని, ఈ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కితే జరిమానా, జైలు శిక్ష విధించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు జరిపితే 87126 85257 నంబర్‌కు సమాచారం అందించాలని సీపీ కోరారు.

దళారుల మాటలు నమ్మొద్దు



'ప్రజాపాలన' దరఖాస్తుదారులు దళారుల మాటలు నమ్మొద్దని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ప్రజాపాలన కేంద్రాల పరిశీలనలో భాగంగా వరంగల్ మున్సిపల్ స్టేడియం, దేశాయిపేటలో నిర్వహిస్తున్న కేంద్రాలను, పోలీసు బందోబస్తును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎవరైనా డబ్బులడిగితే దరఖాస్తుదారులు 87126 85257 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కేంద్రాల పరిశీలనలో బోనాల కిషన్, అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నోడల్ అధికారి



హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయాన్ని శుక్రవారం ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి, సీనియర్ ఐఏఎస్ వాకాటి కరుణ సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు ఆమెను ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ప్రత్యేక పూజల అనంతరం ఈఓ శేషుభారతి అమ్మవారి శేషవస్త్రాలు అందజేశారు. ఆమె వెంట వరంగల్ అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నగర మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా తదితరులున్నారు. అనంతరం ఏసీసీ కార్యదర్శి కె.శ్రీనివాస్ కృష్ణన్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సందర్శనలతో విజ్ఞానం

కాశీబుగ్గ సెంటర్: హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం, సైన్స్ మ్యూజియం సందర్శనతో విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర అభివృద్ధి, శాస్త్రీయ దృక్పథం పెంపొందుతాయని డీడబ్ల్యూఓ వాసంతి అన్నారు. బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్, చైల్డ్ వెల్ఫేర్ విభాగాల ఆధ్వర్యంలో బిర్లా ప్లానిటోరియం, సైన్స్ మ్యూజియం సందర్శనకు వెళ్లిన విద్యార్థుల బస్సులను నగరంలో డీడబ్ల్యూఓ శారదతో కలిసి డీఈఓ శుక్రవారం ప్రారంభించారు. ఇందులో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులు పావని, లక్ష్మీనారాయణ, కుమార్ పాల్గొన్నారు.

మేడిగడ్డలో.. ఐదు గంటలు

ప్రాజెక్టు వద్ద బిజీబిజీగా గడిపిన మంత్రుల బృందం

- కుంగిన ప్రాంతం పరిశీలన.. అన్నారం బ్యారేజీ సందర్శన
- ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఈఎన్‌సీ
- హాజరైన మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ వద్ద మంత్రుల బృందం ఐదు గంటలపాటు గడిపింది. ప్రాజెక్టు పరిస్థితి.. కుంగడానికి గల కారణాలు తదితర అంశాలపై ఈఎన్‌సీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా.. మంత్రులు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న రచ్చపై ముందస్తుగా ప్రకటించిన ప్రకారం.. రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పి.శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బృందం శుక్రవారం మేడిగడ్డకు తరలివచ్చింది. మంత్రులు హైదరాబాద్ నుంచి నేరుగా ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12.14 గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకున్నారు. వారికి కలెక్టర్ భవేశ్ మిశ్రా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిమిత్తం ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.

మేడిగడ్డ పరిశీలన

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ముగిసిన తర్వాత భోజన విరామం తీసుకున్నారు. అనంతరం మంత్రులు వాహనాల్లో మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లారు. కాలి నడకన కొంతదూరం వరకు వెళ్లారు. కుంగిన 21 పియర్ ప్రాంతాన్ని పరిశీలించారు. సుమారు అర్ధగంట పాటు పరిశీలించారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మంత్రులు అన్నారం బ్యారేజీకి చేరుకున్నారు. అక్కడ హెలిపాడ్‌లో దిగిన తరువాత వాహనాల్లో బ్యారేజీ వద్దకు వెళ్లారు. 38వ పియర్ వద్ద సీపేజీ బుంగలు ఏర్పడ్డ ప్రాంతానికి ఇరిగేషన్ అధికారులతో కాలినడకన వెళ్లి చూశారు. 15నిమిషాల్లో తిరిగి వచ్చారు. తిరిగి సాయంత్రం 5.15గంటలకు హైదరాబాద్‌కు పయనమయ్యారు.

బ్యారేజీల వద్ద సందడి..

మంత్రులు, నాయకులు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద ఐదు గంటలపాటు బిజీబిజీగా గడిపారు. ఎల్‌అండ్‌టీ క్యాంపు ప్రాంతం మీడియా, ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్లతో నిండిపోయి కనిపించింది. చాలా రోజుల తర్వాత సందడి నెలకొంది. కాగా.. మంత్రుల పర్యటన నేపథ్యంలో.. జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గోదావరి తీర ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్స్ చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, కలెక్టర్ భవేశ్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖరే, శశిభూషణ్ కాచే, ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు, ఈఈ తిరుపతిరావు, నూనె శ్రీధర్, యాదగిరి, ఓంకార్ సింగ్, సర్పంచ్ విలాస్‌రావు, ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

రెండున్నర గంటలపాటు 'ప్రజెంటేషన్'




ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై ప్రాజెక్టర్ ద్వారా ఈఎన్‌సీ మురళీధర్ రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన సమయం నుంచి ఎత్తిపోతలు ఎత్తిపోయడం, టీఎంసీల వివరాలు, విద్యుత్ వినియోగం గురించి వివరించారు. అక్టోబర్ 21న భారీ శబ్దంతో 7వ బ్లాక్‌లో 20, 21, 22 పియర్‌లు కుంగిపోవడం వంటి ఘటనలు జరిగిన తీరును స్క్రీన్‌పై చూపించారు. అప్పులు, లాభనష్టాల గురించి తెలిపారు. నీటి వినియోగం, తరలింపులను పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో మూడు పియర్‌లు, మూడు గేట్లు పనిచేయవని, పూర్తిగా పరిశోధన చేసిన తర్వాత మిగతావి పనిచేస్తాయా లేదా అనేది తెలుస్తుందని తెలిపారు. మంత్రుల సందేహాలను ఈఎన్‌సీ నివృత్తి చేశారు. సుమారు రెండున్నర పాటు ఈ ప్రజెంటేషన్ కొనసాగింది. ప్రజెంటేషన్‌కు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు వచ్చారు.

మంత్రులు ఏమన్నారంటే..




మంత్రులు శ్రీధర్‌బాబు, ప్రభాకర్




కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి

ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన వాస్తవిక అంశాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించి ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాళేశ్వరాన్ని ప్రపంచ స్థాయిలో గొప్ప ప్రాజెక్టు అని అన్న అప్పటి సీఎం, మంత్రులు కుంగిన తర్వాత నోరు మెదపలేదన్నారు. ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన సాంకేతిక లోపాలు బయటపెడతామని, బాధ్యులపైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాజెక్టుతో భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలకు చుక్క నీరు రాదని తెలిపారు. మంథని, మంచిర్యాల జిల్లా చెన్నూర్ రైతులను ముంపు నుంచి ఆదుకోవాలని అన్నారు. ముంపు జరిగే ప్రాంతాల్లో కరకట్టలు నిర్మిస్తే నష్ట నివారణ జరుగుతుందన్నారు. రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కట్టి ఉంటే తెలంగాణకు గ్రావిటీ ద్వారా సాగునీరు వచ్చి లాభం జరిగేదన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు.





మాట్లాడుతున్న ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రులు

ఎక్కడైనా దరఖాస్తులివ్వొచ్చు

- 66 డివిజన్లలో అన్ని కేంద్రాల్లో స్వీకరణ
- జిల్లా నోడల్ అధికారి, గ్రేటర్ కమిషనర్



ఏనుమాములలో ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న వాకాటి కరుణ, కమిషనర్ బాషా

వరంగల్ అర్బన్: 'ప్రజాపాలన'కు దరఖాస్తుదారులు 66 డివిజన్లలో ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా నోడల్ అధికారి వాకాటి కరుణ, గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో, 14, 15 డివిజన్ల కేంద్రాలను వారు సందర్శించారు. దరఖాస్తు అనంతరం రశీదులిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు? డివిజన్‌లో ఇంకా ఎన్ని రావొచ్చు? అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ చేసిన ఏర్పాట్లను నోడల్ అధికారికి వివరించారు. దరఖాస్తు ఎక్కడ చేసినా ఇంటి నంబర్ ఆధారంగా ఆన్‌లైన్ ద్వారా పరిగణనలోకి తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు జిరాక్స్ బ్లాక్ అండ్ వైట్ పత్రాల్లో పూరించి సమర్పించినా.. పరిగణనలోకి తీసుకుంటామన్నారు. జనవరి 6న సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు. డిసెంబర్ 31, జనవరి 1న సెలవు అని, ఇప్పుడే రేషన్‌కార్డుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలనే నిబంధనేమీ లేదన్నారు. ఆధార్‌కార్డుల జిరాక్స్ పత్రాలను సమర్పించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 5 గ్యారంటీలైన మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాల కోసం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ తూర్పాటి సులోచన, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, మహేందర్ జీ, బల్దియా అదనపు కమిషనర్ రవీందర్‌యాదవ్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి హనుమకొండ మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీను, బల్దియా ఈఈ శ్రీనివాస్, డీఈలు రవికుమార్, సారంగం, సంతోష్‌బాబు, హనుమకొండ తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 46వ డివిజన్ రాంపూర్ సెంటర్‌ను కమిషనర్ రిజ్వాన్ బాషా సందర్శించారు.

దరఖాస్తుల వెల్లువ

ప్రజాపాలనకు శుక్రవారం ప్రజల నుంచి అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నగరవ్యాప్తంగా 66 డివిజన్లలో అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాలకు 15,768 దరఖాస్తులు రాగా.. జనరల్ దరఖాస్తులు 1,618, రేషన్ కార్డుల కోసం 770 మంది దరఖాస్తులు సమర్పించారు. రెండ్రోజుల్లో 31,960 అప్లికేషన్లు వివిధ పథకాల కోసం అందాయి. జనరల్ అప్లికేషన్లు 3,008, రేషన్ కార్డుల కోసం 2,020 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి.

రెండేళ్ల క్రితం వరంగల్ నగరానికి చెందిన యాకయ్య ఇంటి ఎదుట బైక్ పార్క్ చేశాడు. ఎవరో దొంగిలించడంతో చాలాచోట్లా వెతికాడు. పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. అయినా.. ఫలితం లేక పోయింది. ఇక వాహనం ఆచూకీ లభించదనుకున్నాడు. ఊహించనిరీతిలో గత నెలలో ఇతడికి ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. ఆ వాహనదారుడు వాహనాన్ని వదిలేసి పరారయ్యాడు. ఆ వాహనం ఇంజన్ నంబర్ ఆధారంగా థర్డ్ ఐ పోర్టల్‌లో వివరాలు తెలుసుకున్నారు. వాహన యజమానికి ఫోన్ చేశారు. వివరాలను సరిపోల్చారు. అనంతరం అతడి నుంచి ఒరిజినల్ ఆర్సీ, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వాహనాన్ని అప్పగించారు. పోయిందనుకున్న వాహనం లభించడంతో అతడి ఆనందానికి అవధుల్లేవు.

ఏమిటీ థర్డ్ ఐ..

వాహనం కొనుగోలు చేసిన తర్వాత పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయించడం పరిపాటి. ఆ సమయంలో రవాణాశాఖ వాహన ఇంజన్, ఛాసిస్ నంబర్లతోపాటు రిజిస్ట్రేషన్ నంబరు, యజమాని చిరునామా, తదితర వివరాలన్నీ ఆర్టీఏ వెబ్ సైట్‌లో నమోదు చేస్తారు. ఈ వివరాలను పోలీస్‌శాఖ వారి థర్డ్‌ఐ పోర్టల్‌తో అనుసంధానించి ఉంటాయి. అంటే.. ఏదైనా సందర్భంలో ఇంజన్, ఛాసిస్, రిజిస్ట్రేషన్ నంబర్లలో ఏదైనా ఒకటి ఉన్నా.. దానికనుగుణంగా వాహన వివరాలను తెలుసుకునేందుకు ఈ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

థర్డ్ ఐ





వాహనాన్ని ఇట్టే పట్టిస్తోంది!

- ఇంజన్ నంబర్ అధారంగా పరిశీలన
- వాహనం అపహరణకు గురైతే గుర్తింపు ఇక సులభమే
- యాప్‌లో అసలు యజమాని గుర్తింపు..
- పత్రాలు పరిశీలించి వాహనాన్ని అప్పగిస్తున్న పోలీసులు
- ఉమ్మడి జిల్లాలో వాహనదారుల హర్షం

రోడ్డుపై రయ్..రయ్..


రహదారులపై ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రత నిబంధనల ఉల్లంఘనలు ఎక్కువయ్యాయి. అదే స్థాయిలో వాహనాలు చోరీలకు గురవుతున్నాయి. గుర్తు తెలియని దొంగలు సీసీ కెమెరాలు లేని, జన సంచారం తక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకుని చోరీలకు తెగబడుతున్నారు. దొంగిలించిన వాహనాల నంబరు ప్లేట్లు మార్చి పోలీసుల కళ్లు గప్పి రోడ్లపై తిరుగుతున్నారు. దీంతో ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీలో అనేక వాహనాలు పట్టుబడుతున్నాయి. ఇటీవల అధికారులు నంబరు ప్లేటు సక్రమంగా లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని చెప్పడంతో.. వాహనదారులు వాహనాన్ని అక్కడే వదిలేసి పరారవుతున్నారు. ఆతర్వాత నంబరు ప్లేట్‌ను పరిశీలిస్తే అది నకిలీదని తెలుస్తోంది. ఛాసిస్ నంబరును దొంగలు చెరిపేయడంతో అది గుర్తించలేకపోతున్నారు. ఇంజన్ నంబరు ఆదారంగా ' థర్డ్ ఐ'లో పరిశీలిస్తే వాహన వివరాలు మొత్తం బయట పడుతున్నాయి. దాని ఆదారంగా అసలు యాజమాని ఎవరనే విషయాన్ని గుర్తించి, సదరు వ్యక్తికి సమాచారం అందించి సరి చూసి వాహనాలను అప్పగిస్తున్నారు. ఇలా.. ఉమ్మడి జిల్లాలో వందలాది వాహనాలను అప్పగించినట్లు పోలీసులు చెబుతున్నారు. వీటిని పోర్టల్‌లో సరిచూసి అప్పగిస్తామని, ఇంత సంఖ్య అంటూ చెప్పలేమని అంటున్నారు.

(వరంగల్ డెస్క్)

రోడ్డుపై రయ్.. రయ్‌మని మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనం.. దాన్ని నిశ్చితంగా గమనిస్తే సరైన నంబరు ప్లేటు ఉండదు.. ఛాసిస్ నంబరు గుర్తించలేని పరిస్థితి... ఇలాంటి సందర్భాల్లో ఆ వాహనం ఎవరిది? నడిపేది యజమానా? లేక ఇతరులా అనే వివరాలు తెలుసుకోలేమా? బేఫికర్‌గా తెలుసుకోవచ్చు! అదే 'థర్డ్ ఐ'. పోలీసుల వద్ద ఉన్న ఈ సాంకేతికత ఆధారంగా గతంలో అపహరణకు గురైన పలు వాహనాల వివరాలను సులభంగా గుర్తిస్తున్నారు. అసలైన యజమానికి అప్పగిస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధి ఇప్పటికే వందల సంఖ్యలో వాహనాలను ట్రాఫిక్, సివిల్ పోలీసులు స్వాధీన పర్చుకుని వాహన యజమానులకు అప్పగిస్తూ సత్ఫలితాలు అందుకుంటున్నారు.



రిజిస్ట్రేషన్ చేయించుకోవడం మరువొద్దు



వాహనం కొన్న తర్వాత రిజిస్ట్రేషన్, వాహనం బదిలీ చేసుకోవడం, కేసులు, ఫైన్లు క్లియర్ చేసుకోవడంలో యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నచ్చిన నంబర్ అందుబాటులో లేకనో, సమయం లేదనో.. ఇలా వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్‌లో జాప్యం చేస్తున్నారు. ఇది సరికాదు. పెరుగుతున్న దొంగతనాలు, రహదారి ప్రమాదాల నేపథ్యంలో.. వాహనం ఏదైనా వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడం అన్ని విధాలా ఉత్తమం. వాహనం అపహరణకు గురైనా, పోలీస్ తనిఖీల్లో పట్టుబడినా.. వివరాలను సులభంగా గుర్తించాలంటే రిజిస్ట్రేషన్ నంబర్ ఒక్కటే మార్గం. ఇప్పటికే పలు వాహనాలను మేం థర్డ్ ఐ ద్వారా గుర్తించి యజమానులకు అప్పగించాం. - పి.వెంకన్న, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను ముట్టడించిన ఆటో డ్రైవర్లు



బస్ స్టేషన్ ముట్టడి

- ఉచిత ప్రయాణంపై ఆటోడ్రైవర్ల ఆందోళన
- అరెస్ట్ చేసిన పోలీసులు

వరంగల్ చౌరస్తా: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించుకోవాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం వరంగల్ ఉమ్మడి జిల్లా ఆటో డ్రైవర్స్ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను ముట్టడించారు. ఈసందర్భంగా కమిటీ బాధ్యులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్ సౌకర్యం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మంది ఆటోడ్రైవర్ల జీవనం అగమ్య గోచరంగా మారిందన్నారు. ఉచిత బస్సు కార్యక్రమానికి తాము వ్యతిరేకం కాదని, దాని మూలంగా తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో ఫైనాన్సులు, పిల్లల స్కూలు ఫీజులు, రోజువారీ ఫైనాన్సులు కట్టలేక తమ బతుకులు దుర్భరంగా మారాయన్నారు. ప్రభుత్వం స్పందించి సహృదయంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలకు జీవన భృతి కింద నెలకు 15 వేలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆటోడ్రైవర్‌కు రూ.10 లక్షల బీమా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఆటో డ్రైవర్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బాధ్యులు ఈసంపల్లి సంజీవ, మంద శ్రీధర్‌రెడ్డి, మడికొండ బాబు, కలకోట్ల జయరాం, బొల్లం సంజీవ, బొల్లా ఈశ్వర్, షేక్ అమీర్, కొర్లపాటి రమేశ్, కోడూరి యాకూబ్, పసునూరి బాబు, విజయ్, సురేశ్, సదానందం, శ్రీను, బాలరాజు, స్వామి, ప్రవీణ్, నరేశ్, పూజారి రవి, సిరిసిల్ల రమేశ్, వేల్పుల సతీశ్, జయబాబు, రాజు, బండారు మార్కండేయ, శ్యాంసుందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న జాతరపై రేపు సమావేశం

ఐనవోలు: సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరగనున్న ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు సంబంధించి 16 శాఖల జిల్లా అధికారులతో ఈ నెల 31న ఐనవోలు ఆలయ ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



నయీంనగర్: ఉమ్మడి గురుకుల విద్యాలయాల్లో 2024–25 సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ఆర్‌సీఓ విద్యారాణి తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌సీఓ మాట్లాడుతూ ఉమ్మడి ప్రవేశ పరీక్ష 2024 ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్ణయించబడిన జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో జనవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీసెట్. జీటీవీ.ఇన్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సీఓలు సమ్మయ్య, ఉమామహేశ్వరి, భిక్షపతి, జె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కేసుల వివరాలు ఇవ్వండి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కేంద్రంగా తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి ఉద్యమకారులపై నమోదైన కేసుల వివరాలను తమకు ఇవ్వాలని విద్యార్థి ఉద్యమకారుల జేఏసీ నాయకులు డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ ఫిరోజ్ పాషా, డాక్టర్ సయ్యద్ వలి ఉల్లాఖాద్రీ, జోరిక రమేష్ శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వివిధ ప్రభుత్వ పథకాల్లో అవకాశం కల్పించబోతుండటాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. కావున ఉద్యమకారులపై వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదు అయిన కేసుల వివరాలను ఇవ్వాలని కోరారు.

రైల్వే బ్లాక్‌తో పలు రైళ్ల సర్వీస్‌లు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధి హసన్‌పర్తి–ఉప్పల్ రైల్వే స్టేషన్‌ల మధ్య దక్షిణ మధ్య రైల్వే అధికారులు చేపట్టిన నాన్ ఇంటర్ లాకింగ్ బ్లాక్ పనులతో పలు రైళ్ల సర్వీస్‌లను రద్దు చేసినట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట–సిర్పూర్ టౌన్ (17003) వెళ్లే ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17004) వెళ్లే రామగిరి ప్యాసింజర్, కరీంనగర్–సిర్పూర్ టౌన్ (07765) వెళ్లే ప్యాసింజర్, సిర్పూర్ టౌన్–కరీంనగర్ (07766) వెళ్లే ప్యాసింజర్‌ను జనవరి 13వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (12757) వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్ (12758) వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను జనవరి 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కొనసాగిన పరిశోధన పత్రాల సమర్పణ



చర్చా కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు



మాట్లాడుతున్న ప్రొఫెసర్

రెండో రోజు చర్చల్లో ఉత్సాహంగా పాల్గొన్న చరిత్రకారులు

- కేయూలో ప్రతినిధుల సందడి
- నేడు ముగియనున్న ఐహెచ్‌సీ సెషన్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) 82వ సెషన్‌లో భాగంగా రెండో రోజు క్యాంపస్ ఆడిటోరియం వద్ద పరిశోధన పత్రాల సమర్పణ కొనసాగింది. శుక్రవారం ఆడిటోరియంలోని వివిధ కార్యాలయ గదుల్లో మూడు సమాంతర సెషన్‌లలో ప్రతినిధులు, పరిశోధకులు, చరిత్రకారులు తమ పరిశోధన పత్రాల సమర్పనతోపాటు చర్చల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 1,053 పరిశోధన పత్రాలు రాగా పాల్గొన్న వారు తమ పత్రాలు సమర్పిస్తున్నారు. మొదటి సమాంతర సెషన్‌లో దళిత్ హిస్టరీ పానెల్‌లో ఆచార్య బి.రామచందర్‌రెడ్డి అధ్యక్షతన రూట్స్ ఆఫ్ ఇండియన్ సబల్టన్ లేబర్ ట్రాజెక్టరీస్ ఆఫ్ క్యాస్ట్ ఆక్యూపేషనల్ పాటెర్న్స్ అండ్ ది మార్జినలైజ్డ్ అనే అంశంపై ప్రత్యేక ప్యానల్ సెషన్ జరిగింది. ఇందులో మొత్తం 22 మంది పరిశోధకులు వివిధ సామాజిక వర్తమాన పూర్వపు అంశాలపై పత్రాలు సమర్పించారు. న్యూఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగం సీనియర్ ఆచార్యులు చిన్నారావు, చిటీబాబు ప్యానలిస్టుగా వ్యవహరించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ దళితులు, దళిత వర్కర్స్‌కు వేతనాలు, పని పరిస్థితులు ఇతర సామాజిక అంశాలపై జరుగుతున్న వివక్ష, వారి హక్కుల కోసం ఆయన చేసిన కృషిని వివరించారు.

రెండో సమాంతర సెషన్‌లో..

రెండో సమాంతర సెషన్‌లో అలీఘర్ హిస్టోరియన్ సొసైటీ ఆధ్వర్యంలో రిస్ట్రక్చరింగ్ ఇండియన్ ఎకనామిక్ థీయరీ అనే అంశంపై జరిగిన సెషన్‌లో 10కిపైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. ఆచార్య ఇఫ్రాన్ హబీబ్, ఆచార్య పట్నాయక్



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు సుధాకర్

భారత ఉపఖండం పురాతన కాలం నాటి సమకాలీనం వరకు ఆర్థిక పునర్ నిర్మాణ సిద్ధాంతంలో వచ్చిన మార్పులు, గతకాలంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. ఆచార్య ప్రభాత్ పట్నాయక్, ప్రొఫెసర్ కెఎం శ్రీమాలి, ప్రొఫెసర్ రాజం గురుఖల్, ప్రొఫెసర్ కేశవన్ వెలుతాట్, ప్రొఫెసర్ ఇష్రాట్ ఆలం, ప్రొఫెసర్ సయ్యద్ అలీ నదీమ్ రిజావి పత్రాలు సమర్పించటంతో పాటు చర్చల్లో పాల్గొన్నారు.

మూడో సమాంతర సెషన్‌లో..

కేయూలో ఆడిటోరియంలో నిర్వహించిన మూడో సమాంతర సెషన్‌లో డెక్కన్ పాస్ట్ అండ్ ప్రజెంట్ అనే అంశంపై మొదటిసారిగా ప్రాంతాల వారీగా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో అంశం తీసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. డెక్కన్ ప్రాంత సంస్కృతి సంప్రదాయాల్లో వస్తున్న మార్పులపై 12 మంది పరిశోధకులు తమ పత్రాలు సమర్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు సంజయ్ సుబోద్, ఆచార్య సయ్యద్ అలీనదీం రిజావి డెక్కన్ ప్రాంత సూఫీ విధానాలు, ఐడియాలు, పురావస్తు రికార్డులు వాస్తు నిర్మాణ, సాంకేతికగా వచ్చిన మార్పులు వివరించారు.

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు సెషన్లు

కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు సెషన్లలో పరిశోధన పత్రాల సమర్పణ కొనసాగింది. 1,063 పరిశోధన పత్రాలు రాగా అందులో యాన్సింట్, మిడ్యూవల్, మోడర్న్, అదర్ ద్యాన్ కంట్రీ, ఆర్కియాలజీ విభాగాల్లో ప్రతినిధులు పరిశోధన పత్రాలు సమర్పించారు. అలాగే కూనూరులో



పరిశోధన పత్రాలు సమర్పించేందుకు వచ్చిన అంధ ప్రతినిధులు

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ కుందూరు సుధాకర్ కాకతీయుల కాలం నాటి సామాజిక ఆర్థిక సంస్కృతిక అంశాలు వివరిస్తూ పరిశోధన పత్రం సమర్పించారు. పలువురు అంధ ప్రతినిధులు కూడా వారి పరిశోధన పత్రాలు సమర్పించారు. ఐహెచ్‌సీ సెషన్‌కు పరిశోధన పత్రాలు సమర్పించేందుకు వస్తున్న వారికి పాండిచ్చేరికి సంబంధించిన వారు వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ లైఫ్ మెంబర్ షిప్ క్యాంపెయిన్ నిర్వహించారు. సభ్యత్వం తీసుకోవాలని పాండిచ్చేరి ప్రతినిధులు కోరుతున్నారు.

నేడు ముగింపు సభ

కాకతీయ యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరిగే ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ నేడు (శనివారం) ముగియనుంది. సాయంత్రం 4 గంటలకు జరిగే సభకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వీసీ ఆచార్య తాటికొండ రమేష్, ఐహెచ్‌సీ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ, సెక్రటరీ సయ్యద్ అలీ నదీమ్ రిజావి పాల్గొననున్నట్లు లోకల్ సెక్రటరీ ఆచార్య టి.మనోహర్ తెలిపారు.

చరిత్ర సామాజిక చైతన్యానికి నాంది

- నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్ మృదుల ముఖర్జీ



విలేకరులతో మాట్లాడుతున్న మృదుల ముఖర్జీ, పక్కన ఆదిత్య ముఖర్జీ

చరిత్ర అనేది సామాజిక చైతన్యానికి నాంది, వివిధ సామాజిక శాస్త్రాలను సంకుచిత, పక్షపాత ధోరణితో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్, జేఎన్‌యూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు మృదుల ముఖర్జీ అభిప్రాయపడ్డారు. శుక్రవారం కేయూలోని ఆడిటోరియం వద్ద విలేకరులతో మాట్లాడారు. గత చరిత్రను, సామాజిక శాస్త్రాలను చదివితేనే సమాజంలోని అనేక అంశాలు అర్థం చేసుకునే వీలుంటుందన్నారు. పాలకులు కూడా చరిత్రను చదివితే సామాజిక పరంగా మంచి పరిపాలన కొనసాగించగలుగుతారన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు ఎక్కువగా జాబ్ ఓరియంటెడ్ కోర్సులతోపాటు ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల వైపు మొగ్గు చూపుతుండటం, తల్లిదండ్రులు కూడా ఆ దిశగా చదివించేందుకు ఉపక్రమిస్తున్నారని ఇది సరికాదన్నారు. ప్రతీ గ్రామంలో చరిత్ర ఉంటుందని, ఉమ్మడి వరంగల్‌లోని కడవెండి ప్రాంతాన్ని ఒకప్పుడు సందర్శించానని, ఇప్పటికీ ఆ గ్రామం గొప్పతనం చెబుతున్నారన్నారు. చరిత్ర అంటే ఇదేనన్నారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ ఆదిత్య ముఖర్జీ మాట్లాడుతూ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) ఏ పార్టీకి సంబంధించినది కాదన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు అణచివేతలపై ఆర్ఎస్ శర్మ పుస్తకం రాయగా దానిని నిషేధించారని ఇది సరికాదన్నారు. వాస్తవికత చరిత్రను ప్రజలకు తెలియజేయటంలో చరిత్రకారుల ముందుకెళ్తున్నారని, అందుకు ఐహెచ్‌సీ కృషి చేస్తుందన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

- అధికారులకు కేంద్ర మంత్రి ఆదేశాలు



ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్ పత్రాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి బీఎల్ వర్మ

హన్మకొండ: అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ అధికారులను ఆదేశించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సమావేశమయ్యారు. ఉజ్వల్ పథకం ద్వారా పేద కుటుంబాలకు ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్ అందిస్తున్నామని తెలిపారు. సౌభాగ్య పథకం ద్వారా మారుమూల గ్రామీణ ప్రాంతాలకు సైతం విద్యుత్ సరఫరా అందేలా చూడాలని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంతోపాటు స్వనిధి పథకం ద్వారా చిరువ్యాపారులకు రుణ సదుపాయం అందేలా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో మరుగుదొడ్ల నిర్మాణం, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు.

అభ్యర్థులు ఖర్చుల వివరాలివ్వాల్సిందే..



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

హన్మకొండ అర్బన్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులంతా ఎన్నికల ఖర్చులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు రాహుల్ పంజాబ్‌రావు గవాండే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు, ఎన్నికల సహాయ వ్యయ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ చేసిన ప్రతీ అభ్యర్థి నుంచి పూర్తి లెక్కలు తీసుకోవాలని, లెక్కల్లో తేడాలొస్తే నోటీసులు జారీ చేయాలన్నారు. జిల్లా అధికారులు మాట్లాడుతూ.. పరకాలలో మొత్తం 28 మంది పోటీ చేయగా.. వారిలో 26 మంది లెక్కలు అందించారని వరంగల్ పశ్చిమలో 15 మంది పోటీ చేయగా.. 12 మంది వివరాలిచ్చారని మిగతా వారు ఇవ్వాల్సి ఉందన్నారు. 24 గంటల్లో అందరి వివరాలు సేకరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, రాధిక గుప్తా తదితరులు ఉన్నారు.

రైల్వే సంఘ్ అసిస్టెంట్ సెక్రటరీగా ప్రవీణ్



కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో టెక్నీషియన్ గ్రేడ్–1గా పని చేస్తున్న టి.ప్రవీణ్ కుమార్‌ను రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డీజిల్ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీగా నియమించారు. ఈమేరకు సికింద్రాబాద్ డివిజన్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.వి.చౌదరి, ప్రభురాజ్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన కాజీపేట డీజిల్ బ్రాంచ్ చైర్మన్ మధుసూదన్‌రావు, సెక్రటరీ జగదీశ్వర్‌రావు, సికింద్రాబాద్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ కమిటీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సారెస్పీ భూముల కబ్జాపై చర్యలు

- ఏఈపై దాడికి యత్నం
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

హసన్‌పర్తి: ఎస్సారెస్పీ భూముల్లో వెలిసిన ఆక్రమణల తొలగింపునకు శుక్రవారం అధికారులు ఉపక్రమించారు. నీటిపారుదలశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కిశోర్ ఆధ్వర్యంలో సిబ్బంది ముచ్చర్ల క్రాస్‌తోపాటు పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించారు. పలివేల్పుల సమీపంలో ఎస్సారెస్పీ భూముల్లో వెలిసిన గుడిసెలు, హద్దులను తొలగిస్తున్న క్రమంలో ఆక్రమణదారులు అడ్డుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు పుల్లా అశోక్, దేవరకొండ సుధాకర్, రజిత అక్కడికి చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. సీపీఎం నాయకులు డోజర్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో విధుల్లో ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ దామరశెట్టి కిశోర్ ఆ దృశ్యాలను ఫోన్‌లో చిత్రీకరిస్తున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన సీపీఎం నాయకులు పుల్లా అశోక్, దేవరకొండ సుధాకర్, రజితలతోపాటు మరికొందరు ఏఈ చొక్కా లాగి దాడికి యత్నించారు. ఏఈ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను నేలకు బలంగా కొట్టి ధ్వంసం చేశారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

జరిగిన సంఘటనపై అసిస్టెంట్ ఇంజనీర్ దామెరశెట్టి కిశోర్ కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విధులను అడ్డుకోవడమే కాకుండా దాడికి యత్నించి ఫోన్ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈవిషయమై ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య మాట్లాడుతూ.. ఘటనకు సంబంధించిన సమాచారం అందిందని, కానీ, లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

వెయ్యి పంచితే.. మూడు వందలే దాఖలు

- రూ.40లకు కలర్ దరఖాస్తుల విక్రయాలు



బాలసముద్రంలో దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

వరంగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆరు గ్యారంటీల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన సభల్లో రోజులో సుమారు వెయ్యి దరఖాస్తు ఫారాలను వార్డుల్లో ప్రజలకు పంపిణీ చేస్తుండగా సాయంత్రం వరకు కేవలం 300–400 వరకే దాఖలు అవుతున్నాయని అధికారులు అంటున్నారు. మిగిలిన దరఖాస్తులు ఎటు పోతున్నాయో.. తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయి. సభల సమయంలో దరఖాస్తులను పంపిణీ చేస్తున్న సిబ్బంది ఒక్కొక్క కుటుంబానికి ఒక్కటి చొప్పున కాకుండా ఎక్కువ సంఖ్యల్లో ఇస్తుండడం వల్ల ఈపరిస్థితులు నెలకొంటున్నట్లు తెలుస్తోంది. ఇలా తీసుకున్న వారు బయటకు వెళ్లి అసలు దరఖాస్తులు ఇవే అంటూ.. రూ.40కి ఒక్కటి చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. జిరాక్స్(బ్లాక్ అండ్ వైట్)దరఖాస్తులు సైతం అధికారులు స్వీకరిస్తారని నగర కమిషనర్ ప్రకటించినా.. ప్రజలు మాత్రం మీసేవ సెంటర్లు, జిరాక్స్ సెంటర్ల ఎదుట బారులుదీరుతున్నారు. దీంతో కలర్ ప్రింటు దరఖాస్తులను రూ.40కి విక్రయిస్తున్నట్లుగా తెలుస్తుంది. దరఖాస్తులు ఇస్తున్న సమయంలో ఎలాంటి నమోదు లేకపోవడం వల్ల తీసుకున్న వారే మళ్లీ వచ్చి తీసుకుపోతున్నా.. పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. కొన్ని డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు దరఖాస్తులు తీసుకుని వారి అనునాయులకు ఇవ్వడం వల్ల తమ పార్టీకి దక్కడం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై కార్పొరేటర్లను కొన్ని డివిజన్లలో నిలదీస్తున్న వీడియోలు వాట్సప్‌లో వైరల్ అవుతున్నాయి.

వీడని చిక్కుముడి..

- విజయ హత్య కేసులో లభించని ఆధారాలు
- నిందితుల కోసం శ్రమిస్తున్న పోలీసులు



విజయ (ఫైల్)

కాజీపేట: కాజీపేట పట్టణంలోని రహమత్‌నగర్ కాలనీలో 15 రోజుల క్రితం అదృశ్యమై దారుణంగా హత్యగావించబడి రహదారిపై శవంగా పడి ఉన్న కన్నె విజయ కేసులో నానాటికి చిక్కుముడులు పెరుగుతున్నాయి. ఆదిలో కేసును సులభంగా పరిష్కరించవచ్చని భావించిన పోలీసులకు గతంలో వచ్చిన దృశ్యం సినిమాను గుర్తుకు తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. భర్త చనిపోవడంతో కుమారుడి వద్ద ఉంటూ చిన్న, చిన్న మొత్తాలను తెలిసిన వాళ్లకు ఇస్తూ ఉండే విజయకు అంతర్గత శత్రువులు అంటూ కాలనీలో ఎవరూ లేరంటున్నారు. మరి అలాంటప్పుడు విజయను హత్య చేసి శరీరానికి అయిన గాయాలతో పాటు రక్తపు మరకలను శుభ్రంగా సబ్బు నీళ్లతో కడిగి మళ్లీ ఇంటి సమీపంలోనే పడేసే ధైర్యం ఎవరు చేసి ఉంటారనే విషయం సందేహాలను రేకెత్తిస్తుంది. కాలనీ సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో ఎక్కడ కూడా నిందితులు కనిపించకపోవడం, పోలీసులకు చిన్న క్లూ లభించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో కేసును ఛేదించడం క్లిష్టంగా మారింది. ఏసీపీ డేవిడ్ రాజ్‌తో పాటు పోలీసు శాఖలోని పలు శాఖల సిబ్బంది నిందితులను పట్టుకోవడానికి హత్య వెలుగు చూసిన రోజు నుంచి మఫ్టీలోనూ ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. కాలనీ వాసులతో పాటు కుటుంబ సభ్యులు, ఇతర అనుమానితులపై నిఘాను పెంచిన పోలీసులు కడు జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. అందరినీ వరుసగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించి పంపిస్తున్నారు. ఈ కేసును ఏ విధంగానైన ఛేధించి నిందితులను చట్టం ముందు నిలపాలని పోలీసులు నిరంతరంగా శ్రమిస్తున్నారు. వృద్ధురాలిని అకారణంగా పొట్టన బెట్టుకున్న నిందితులను పట్టుకోవడంలో విజయం సాధించాలని కాలనీవాసులు ఆకాంక్షిస్తున్నారు.

బాలికపై లైంగిక వేధింపులు

- నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా

వరంగల్ లీగల్: ఒంటరిగా ఇంట్లో ఉన్న 4వ తరగతి చదువుతున్న 8 ఏళ్ల బాలికను లైంగికంగా వేధించినట్లు నేరం రుజువు కావడంతో హసన్‌పర్తికి చెందిన మేకల రమేష్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధి స్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి.అపర్ణ దేవి శుక్రవారం తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రం అంబేద్కర్‌నగర్‌కు చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వారి చిన్న కుమార్తె 4వ తరగతి హసన్‌పర్తి ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా 2020 జనవరి 30న పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉంది. తల్లిదండ్రులు కూలి పని నిమిత్తం వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక వద్దకు సమీప బంధువైన మేకల రమేష్(40) వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సాయంత్రం ఇంటి చేరిన తల్లిదండ్రులకు బాలిక తెలిపింది. మరుసటి రోజు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో నేరస్తుడు మేకల రమేష్‌కు 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1,000ల జరిమానా, బాధితురాలికి రూ.50వేల పరిహారం చెల్లించాలని తీర్పు వెల్లడించారు. కేసును పోలీస్ అధికారులు టీ. గోపి, ఎల్.పవన్‌కుమార్ పరిశోధించారు. లైసన్ ఆఫీసర్ ఎం.వెంకటస్వామి, భరోసా కేంద్రం న్యాయవాది నీరజ పర్యవేక్షణలో కానిస్టేబుళ్లు వీ.రవీందర్, రవి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసును వాదించారు.

ప్రభుత్వ మార్పుతో నిర్బంధం తొలగింది



టీఎస్ ఈఈయూ–327లో చేరినవారితో శ్రీధర్

హన్మకొండ: రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో నిర్బంధాలు తొలగిపోయాయని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ యూనియన్‌ల నుంచి విద్యుత్ ఉద్యోగులు, ప్రధానంగా జేఎల్ఎంలు టీఎస్ ఈఈయూ–327లో చేరారు. యూనియన్‌లో చేరిన వారికి టీఎస్ ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ కండువా కప్పి ఆహ్వానించి, మాట్లాడారు. గత ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల హక్కులు కాలరాసిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీఎస్ఈఈయూ–327 టీఎస్ ఎన్పీ డీసీఎల్ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు తులసి శ్రీమతి, నీలం ఐలేష్, మచ్చిక బుచ్చయ్య గౌడ్, డీ.సదయ్య, ఓదేలు, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీటు కోసం సిగపట్లు



ఆర్టీసీ బస్సులో కొట్టుకుంటున్న మహిళలు

- ఆర్టీసీ బస్సులో కొట్టుకున్న మహిళలు
- వరంగల్ నుంచి నర్సంపేట వెళ్తున్న బస్సులో ఘర్షణ

నర్సంపేట రూరల్ : ఆర్టీసీ బస్సులో సీటు కోసం మహిళలు సిగపట్లు పట్టుకున్నారు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేస్తుండడంతో బస్సులన్నీ రద్దీగా ఉంటున్నాయి. వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మొదట ఓ మహిళ సీటు కోసం రుమాలు వేసింది. ఆమెకంటే ముందు ఎక్కిన మరో మహిళ ఆ సీటులో కూర్చుంది. బస్సు నర్సంపేట రూట్‌లో వెళ్తుండగానే ఆ తరువాత ఎక్కిన మొదటి మహిళ నా సీటులో ఎలా కూర్చుంటావంటూ ప్రశ్నించింది. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి జుట్లు పట్టుకుని కొట్టుకున్నారు. ఆ తరువాత మరో మహిళ వచ్చి మా సీట్లో కూర్చున్నావంటూ అడిగింది. వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగి కొట్టుకున్నారు. తోటి ప్రయాణికులు వారిని ఆపారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖిలావరంగల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, రిజర్వ్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ జగదీశ్ సూచించారు. ఈమేరకు శుక్రవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ఆడిటోరియంలో ఆర్‌బీఐ అధికారులు శివారెడ్డి, అరవింద్, హర్షవర్ధన్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా వారు హాజరై మాట్లాడారు. మొబైల్ వాడకం పెరిగిందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెలబ్రెటీల నుంచి దినసరి కూలి వరకు ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్ మోసాలకు గురవుతున్నారని, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. బ్యాంకింగ్ మోసాలు, ఓటీపీ ఫ్రాడ్స్, లోన్ ఆప్స్, గూగుల్ రేటింగ్ స్కాం, ఫైనాన్సియల్ ఫ్రాడ్ కాల్స్ వంటి బ్యాంకింగ్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌బీఐ అధికారులను కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి సత్కరించారు. ఏసీ జయరాం, రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శోభన్, రమేష్, పురుషోత్తంరెడ్డి, దయశీల, చంద్రన్న, అశోక్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- జనగాంకి దగ్గరలో Farm Land చ॥గ॥ 2100/- DTCP చ॥గ॥ 3600/- లాంచింగ్ ఆఫర్‌తో గలవు. భూమి విలువ తెలిసినవారు త్వరపడి తక్కువ ధరకే Plot కొని ఆనందించగలరు. Ph: 7416591078 [H-801455]

SERVICES

- శ్రీ బాలాజీ లోన్స్: మార్టిగేజ్ లోన్స్, పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, IT రిటర్న్స్ (GST) చేయబడును. కాకతీయ టాకీస్, వరంగల్, ప్లాట్స్ కొనుగోలుపై ఇవ్వండి. సంప్ర॥ 9573451926, 8522825358. [W-788977]

WANTED

- Wanted Experienced Lab Technician, Pharmacist, PRO & Supervisor to work at Sri Sri Cardiac Center, Hanumakonda. Cont: 9966653521, 8639082085. [WA-7263]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167569]
- మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-8407]
- భువనగిరి ఏరియాలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం : 12,000/- రూం వసతి ఫ్రీ, 12 గంటల డ్యూటీ. సంప్ర॥ 6304719869. [Y-784280]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18k సంప్ర: 9160900024 / 9640400073. [H-793669]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.